ఒక వసుంధర

11

నిద్ర లేస్తూనే వీధి గుమ్మానికి వేలాడ దీసిన ప్లాస్టిక్ కవరులో పాలప్యాకెట్ల కోసం చూసి, అవి లేకపోవడంతో, ముందు జాగ్రత్తగా ఫ్రిజ్‌లో దాచిన నిన్నటి ప్యాకెట్ కాగడానికి పెట్టి, బ్రష్ చేసుకోవడానికి వెళ్ళింది లలిత.

కాలింగ్ బెల్ మోగింది. విసుక్కుంటూ తలుపు తీస్తున్నాడు రమేష్. అవతల చిన్నపిల్ల గొంతు...

"మరేమో మా తాత రేతిరి సచ్చిపోనాడండి. ఇంగ పదిరోజుల దాకా పాలు తేడం కుదర్దని మాయమ్మ సెప్పి రమ్మంది"

"సర్లేపో"

అదేమిటీ! రాత్రి బాగానే వున్నాడు. అప్పుడే ఎట్లా పోయాడు? అయినా చావు వార్తని కూడా ఇంత తేలిగ్గా తీసుకుంటాడేమిటి రమేష్?

'అయ్యో పాపం' అని కూడా అనకుండా.

ఈమధ్య రమేష్‌కి విసుగెక్కువైంది.

'రంగయ్య పోయాట్ట. పదిరోజుల దాకా పాలు రావుట. ఇంకెవరన్నా గుండెజబ్బున్న ముసలాడుంటే చూసి పాలు తెప్పిచ్చుకో. అన్నట్లు నీ 'పని వృద్ధురాలు' కూడా రాలేదల్లే వుంది. అది కూడా పోయిందేమో కనుక్కో'' అని విసురుగా బ్రష్ చేసుకోడానికి వెళ్ళాడు.

ఆయాసపడుతూ, కర్రపోటు వేసుకుంటూ మనవరాల్ని వెంటబెట్టుకుని నిన్న సాయంత్రం పాల డబ్బులకి వచ్చాడు. అతనికి గుండె జబ్బు ఉండే ఉంటుంది. సంపాదించకపోతే తిండి లేదు. ఎవరూ అతనికేం పని చెప్పకపోతే బ్రతికే దారి మూసేసినట్లే. పక్క అపార్ట్‌మెంట్స్‌లో పదిహేను కుటుంబాలకి, చుట్టుపక్కల నాలుగైదు ఇళ్ళకి పాలు తెస్తాడు. వీళ్ళంతా ముసలివాడి చేత పని చేయించుకోవడం ఏమిటని అనుకుంటే అతనికొచ్చే ఆ నాలుగయిదు వందలూ రావు. ముసలివాడని కూడా చూడకుండా మెట్లెక్కి వెళ్ళమంటాడు అపార్ట్‌మెంట్స్ వాచ్‌మెన్. యాంజియోగ్రామ్‌లకి, బైపాస్‌లకే కాదు, కనీసం ఈసీజీ కూడా తీయించుకోలేనివాడు. ఆత్మహత్య మహాపాపం అని నమ్మినవాడు. బ్రతికినన్నాళ్ళూ ఎట్లాగో సంపాదించాలని, ఎవరి మీదా ఆధారపడకూడదని అనుకున్నవాడు. సంపాదించిన నాలుగు వందలూ కూతురు చేతిలో పెట్టి, ఆ పిల్ల పెట్టింది తింటాడు. అల్లుడు మంచివాడే పాపం. 'నీ అన్న వొదిలేసిపోతే నువ్వెందుకు చూడాలి?' అని నిగ్గదియ్యడు. రంగయ్య పోవడం రంగయ్యకి మంచిదే. కూతురుకీ మంచిదేనేమో. ఈ కాస్త ఓపికా పోయి, మంచం ఎక్కి ఈ నాలుగువందలూ లేకపోతే ఆ కూతురు అతనికి అన్నం పెట్టగలదా?

రాములమ్మ రాలేదు. ఆమె కథా యింతే. తను పని మాన్పించితే ఆమె నెవరూ పెట్టుకోరు. ముసల్ది కదా అని గట్టిగా పని చెప్పలేదు. తన యింట్లో పని చేస్తే కాస్త కాఫీ, టిఫినూ, ఒక పూటకి సరిపడా తిండి దొరుకుతాయి. సాయంత్రం ఆమె కోడలు తిట్టుకుంటూ ఇంత ముద్ద పడేస్తుంది. కోడల్దేం తప్పు. కొడుకు సంపాయించిందంతా యింటికి ఇవ్వడు. అదీ కష్టపడుతుంది. దాని బాధ దానిది.

'లోకం బాధలన్నీ నీవే' అని రమేష్ విసుక్కుంటాడు. ఆ విసుగులో తన పట్ల కాస్త గౌరవం వుందనుకుంటుంది లలిత.

"ఎవరన్నా కుదిరేదాకా పాలు తెస్తాలే లలితా. ఇప్పుడు తెమ్మంటావా?'' అన్నాడు రామారావు వంటగదిలోకొచ్చి.

"కాఫీ త్రాగి తెద్దురులెండి. తొందరలేదు'' అంది లలిత.

వంటింటి గుమ్మంలో అడుగుపెట్టడం పాపపంకిలంలో అడుగుపెట్టడంలాగా ఫీలయిపోయే మావగారు తనంతతాను ఇట్లా పాలుతెస్తానని ముందుకురావడం ఒక వింతే. 'స్థాన బలిమి'లాగ 'భార్య బలిమి' కూడా ఉంటుంది మగవాళ్ళకి. 'తక్కువేమి మనకు భార్య

ఇక్కడుండువరకూ' అని మీసాలు మెలేస్తారు. ఆవిడ లేకపోతే కాస్త భూమి కనిపిస్తుందను కుంటా. నిన్న సాయంత్రం తను ఇంటికొచ్చేసరికి వరండాలో చాపలు వేసి కూడా వుంచాడు.

ఇంతలో వచ్చింది రాములమ్మ.

ఏమిటో వసుంధర వెళ్లిపోయిందగ్గర్నుంచీ దిగులు. ఎంత దాచుకుందామన్నా కుదరడం లేదు. ఆ దిగుల్ని చిరాకుగా విసుగ్గా మార్చేసుకున్నాడు రమేష్. రామారావు బింకంగా వున్నాడు. తనకసలేం అర్థం కావడంలేదు.

ఆవిడ బ్రతికి వుందా? చనిపోయిందా? చనిపోవాల్సినంత కష్టం ఏం కలిగింది? ఇక్కడున్న ఆరునెలలూ తను ఆవిడకేం యిబ్బంది కలిగించదు. అమ్మలాగానే ఆవిడ కూడా అడక్కుండానే తనకి అన్నీ అమరుస్తుంది. సాయంత్రం స్కూల్ నించి వచ్చేసరికి, అల్లం వేసిన ఘుమఘుమలాడే వేడివేడి టీ కప్పుతో పలకరించడంలో ఆవిడ కళ్ళల్లో ప్రేమే కనపడు తుంది గానీ 'విధి లేక చేయడం' కనిపించదు.

'ఆవిడ పోయిందేమో' అని తనకి అనిపిస్తుందిగానీ రమేష్ మాత్రం అట్లా జరిగి ఉండదంటాడు.

అవును చనిపోయే మనిషికి యాభై ఏళ్ళనాటి ఎస్సెసెల్సీ రిజిష్టరూ, రోజూ ఆమె పూజ చేసే అమ్మవారి పటం, పూజ పుస్తకాలూ, రెండు మంచి జరీ చీరెలూ ఎందుకూ? బ్రతికి ఉండడానికి అవి మాత్రం సరిపోతాయా?

ఈ వయస్సులో ఏం ఉద్యోగం దొరుకుతుంది ?

ఈ మిస్టరీ ఛేదించగలది ఒక్క 'ముత్యమే.'

ఆమె వెళ్లిన రెండవరోజు పోలీస్ రిపోర్ట్ యిద్దామంటే వద్దంటే వద్దంది. పదిరోజులు చూడమంది. వసుంధర అట్లాంటి పని చెయ్యదని తన అంతరాత్మ చెబుతోందంది. ఆవిడేదో దాస్తోందని, వసుంధర ఎక్కడికెళ్ళిందో ఆవిడకి ఖచ్చితంగా తెలుసుననీ అనిపించింది లలితకి.

ఇవ్వాల్టికి పదిరోజులూ అయిపోయాయి. సాయంత్రం వెళ్ళి అసలు సంగతి తేల్చుకు రావాలి. ఆమధ్య ఇట్లాగే ముత్యం తనకి తోడు రావాలని మావగార్ని ఒప్పించి పదిరోజులు ఎక్కడికో తీసుకెళ్ళింది వసుంధరని. వచ్చాక ఆయన ఆవిణ్ణి తిట్టిన తిట్లకి తనకి చాలా కోపం వచ్చింది.

ఆవిడుంటే తనకెంతో సహాయంగా ఉండేది.

ఎనిమిదింటికల్లా పిల్లలకి లంచ్‌బాక్సులు, తొమ్మిదింటికి తనూ రమేష్ వెళ్ళిపోవడం, సాయంత్రం వచ్చేసరికి వరండానిండా ట్యూషన్ పిల్లలు.

ఆవిడ ఇల్లు విడిచివెళ్ళిన మూడోరోజున అనుకుంటా రమేష్ అన్నాడు. "నేనిట్లా ఆరునెలల చొప్పున వాటాలేసి తప్పు చేశాను లలితా. అమ్మ తిరిగొచ్చాక ఇంక వాళ్ళని పంపను.

కేరింగ్ అండ్ షేరింగ్ అంటే అమ్మానాన్నల్ని పంచుకోడం కాదు. ఏదో ఆయన మీద కోపం వచ్చి అట్లా చేశానుగానీ, అమ్మేం చేసింది పాపం. నేను చాలా తప్పు చేశాను."

"అవును రమేష్. వాళ్ళని అక్కడింకా రెండు నెలలు ఉంచుకోమని కల్పనకి ఉత్తరం రాసి నేనూ తప్పు చేశాను" అంది లలిత.

ఇద్దరికీ కన్నీళ్ళొచ్చాయి.

* * *

రమేష్, లలితా ఇప్పుడుంటున్న ఇంట్లో పదేళ్ళుగా ఉంటున్నారు. మూడు గదులు, వరండా, చిమ్మి ముగ్గు పెట్టడానికి కాస్త వాకిలీ, బట్టలారేసుకోడానికి కాస్త పెరడూ వాళ్ళిద్దరికీ, ఇద్దరు పిల్లలకీ సరిపోతూనే ఉంది. పిల్లలిద్దరూ ఇప్పుడు 'ఇంటర్'లోకి వచ్చారు. ఇంటర్ అంటే మహా గొప్ప చదువు కదా! దాని తరువాత ఎంసెట్. అదింకా జీవితాన్ని నిర్ణయించే పరీక్ష. అందుకని ఒక గది పూర్తిగా పిల్లలకి కేటాయించింది లలిత.

రామారావు రెండేళ్ళ క్రిందట రిటైరయ్యే వరకూ వాళ్ళిద్దరూ వైజాగ్‌లో ఉండేవాళ్ళు. అతను చేసిన ఉద్యోగానికి పెన్షనంటూ ఏమీలేదు. ఉద్యోగం చేసే రోజుల్లో ఏమీ దాచుకోలేదు. అతనికి కాస్త స్వంత ఖర్చు ఎక్కువే. పిల్లల చదువులు, ఆడపిల్ల పెళ్ళి కోసం కాస్త అప్పు కూడా చేశాడు. రిటైరైనాక వచ్చిన బెనిఫిట్స్‌తో అప్పులు తీర్చగా మూడు లక్షలు మిగిలాయి.

అదే సమయంలో లలితావాళ్ళు అద్దెకుంటున్న ఇంటి ప్రక్కనుండే ఇల్లు పడగొట్టి అపార్ట్‌మెంట్స్ వేస్తున్నారు. ముందుగా రెండు లక్షలు కడితే తక్కింది తనే బ్యాంకులో లోన్ యిప్పిస్తానని బిల్డర్ చెప్పాడు. తనకో రెండు లక్షలిస్తే అపార్ట్‌మెంట్ బుక్ చేసుకుంటానని అడిగాడు రమేష్ తండ్రిని. ఆయన భార్యని తప్ప తక్కిన చాలామందిని సలహా అడిగాడు. అడిగినవాళ్ళల్లో సగానికి పైగా అట్లా ఇవ్వవద్దని, ఇస్తే ఇబ్బంది పడతావని చెప్పారు. ఎక్కువ వడ్డీ ఇచ్చే బ్యాంకులో పెట్టుకుంటే నెలకింత అని వడ్డీ వస్తుందనీ, అది పెన్షన్‌లా ఉంటుందని చెప్పారు. 'రమేష్ కివ్వండి' అని తనని అడక్కపోయినా సలహా యిచ్చింది వసుంధర.

"నీ బోడి సలహాకి సంతోషించాంలే" అన్నాడు రామారావు.

ఒక లక్ష మాత్రం గవర్నమెంటు బ్యాంకులో దాచి తక్కిన రెండూ వేరే బ్యాంకులో పెట్టాడు. కొన్ని సామాన్లు అమ్మేసి, కొన్ని కొడుకులిద్దరికీ సర్దేసి, రమేష్ దగ్గర కొచ్చేశాడు. పిల్లలకి చదువులు చెప్పించి పెద్ద చేయడం తన బాధ్యత ఎలాగో, రిటైరైనాక తనని చూడడం వాళ్ళ బాధ్యత అని ఆయన ఉద్దేశ్యం.

తండ్రి తను అడిగిన డబ్బివ్వలేదని రమేష్‌కి కోపం వచ్చింది.

"పిల్లల చదువులయ్యే వరకూ మనకి అపార్ట్‌మెంటూ వద్దు, ఏం వద్దు. కార్పొరేట్ కాలేజీ ఫీజులు, ఆపైన ఓపెన్ సీటు రాకపోతే పేమెంటు సీటు చాలా అవుతుంది. లోన్లు తీసుకుని కట్టడం కష్టం" అంది లలిత.

"రోగి, వైద్యుడూ కూడా పాలే కోరార్లే. ఆయన తన డబ్బు బ్యాంకులో ఫిక్సడ్ వేసే శాడు" అన్నాడు రమేష్.

వాళ్ళని తనొక్కడే ఎందుకు భరించాలి. తమ్ముడు మాత్రం చూడొద్దా. అసలు తనకంటే వాడిదే పెద్ద ఉద్యోగం. జీతమూ ఎక్కువే అనేసి అతన్ని పిలిపించి వంతులు వేశాడు. చెరి ఆర్నెల్లు భరించేలాగ.

మొదట్లో ప్రైవేటు బ్యాంకు ఠంచనుగా వడ్డీ ఇచ్చింది. ఆ వడ్డీ అయినా దాచుకోమని వసుంధర చెబితే రామారావు విన్లేదు. ఎవరింట్లో ఉంటే వాళ్ళకోసం ఖర్చు పెట్టేవాడు. సంవత్సరం దాటేసరికి బ్యాంకు వడ్డీ ఆపేసింది. మరో రెండు నెల్లకి మూతపడిపోయింది. రెండు లక్షలు ఎటుపోయాయోగాని బి.పి. మాత్రం పెరిగింది.

మావగారి డబ్బు పోగానే సురేష్ భార్య కల్పనకి అత్తగారి వంట నచ్చడం మానేసింది. ఆవిడకి శుభ్రం లేదనిపించింది. పని అసలు చేతగాదనిపించింది. తన తల్లిలా రకరకాల వంటలు రావనిపించింది. తనంత శుభ్రంగా వుండదనిపించింది. ఎప్పుడెప్పుడు ఆరునెలలు అవుతాయా, ఎప్పుడు వీళ్ళ నుంచి విముక్తా అనిపించింది.

రామారావుకిప్పుడొచ్చేది నెలకి ఏడువందల యాభై. అందులో తనకీ భార్యకీ మందులు కొనుక్కోవాలి. కనపడకుండా చాలా ఖర్చులుంటాయి. వాటన్నింటికి పిల్లల్ని అడగడం అతనికి నామోషీగా ఉంది. అవమానంగా ఉంది. ఆ నామోషీని, అవమానాన్ని భార్య మీద తప్ప ఎవరి మీద చూపించగలడు. ఆ బ్లాటింగ్ పేపర్ అన్నీ పీల్చుకుంటుంది. ఈసారి వాళ్ళు రాబోయే ముందు లలిత కల్పనకి ఉత్తరం రాసింది. 'వాళ్ళనక్కడే ఇంకో రెండు నెలలుంచుకో. మా పిల్లల పరీక్షలయేదాకా. తరువాత నేను వాళ్ళని రెండు నెలలెక్కువ ఉంచుకుంటాను' అని.

ఆ ఉత్తరం చూడగానే కల్పన వాళ్ళకి ట్రెయిన్ టికెట్స్ రిజర్వ్ చేయించి పంపించేసింది.

అయినా లలితేం విసుక్కోలేదు. పిల్లల గది వాళ్ళకిచ్చి పిల్లల్ని స్నేహితుల ఇంట్లో చదువుకోడానికి ఏర్పాటు చేసింది. తమ కోసం కొడుకు కాస్త పెద్ద యిల్లు తీసుకోలేదని కినుకగా ఉండేది రామారావుకి. ఇంటద్దెలు, తక్కిన ఖర్చులు అన్నీ పెరిగిపోయిన ఈ రోజుల్లో ఆరునెలల కోసం పెద్ద యిల్లు తీసుకోవడం అనవసరం అంది లలిత. సాయంత్రం వరండాలో కూర్చోడానికి వీల్లేకుండా ట్యూషన్ పిల్లలుండడం రామారావుకి చిరాకు. అందుకోసం రెండు బజార్లు నడిచి వస్తాడు.

* * *

పెరట్లో చీరెలు ఆరేసుకుంటున్న వసుంధరని పక్క అపార్ట్‌మెంటు బాల్కనీలో నుంచి ఎవరో పేరు పెట్టి పిలిచారు. తల ఎత్తి చూస్తే తనతోపాటు కొలకలూరు హైస్కూల్లో ఎసెసెల్సీ వరకూ చదివిన సుజాత. ఆమెని చూసి పాతికేళ్ళు పైన అయింది.

"మధ్యాహ్నం మా యింటికి రా" అని అరిచింది.

ఆ సంగతి లలితతో చెప్పింది వసుంధర.

ఎప్పుడూ మడత నలగని ఇస్త్రీ చీరెలు కట్టి, ముఖం తళతళా తోమి పౌడరువేసి, కత్తిరించిన జుత్తుకి చీర రంగు హెయిర్ బాండ్ వేసి భర్తతో సాయంత్రం బయటికి బయల్దేరే ఆమెకి 'కడిగిన ముత్యం' అనీ, పచ్చగా బొద్దుగా, బట్టతలతో ఉండే ఆయనకి 'గజనిమ్మపండు' అని తను పేర్లు పెట్టానని చెప్పింది లలిత. అప్పట్నించీ సుజాతని 'ముత్యం' అనడం అలవాటైంది. సుజాత భర్త ఏదో మంచి ఉద్యోగమే చేసి బాగా పెన్షన్ తెచ్చుకుంటున్నాడనీ, పిల్లలు విదేశాల్లో స్థిరపడ్డారనీ వీళ్ళకి మాత్రం అక్కడికి వెళ్ళడం నచ్చక ఇక్కడ అపార్ట్‌మెంటు కొనుక్కుని ఉండిపోయారనీ చెప్పింది లలిత.

"అట్లాంటివాళ్ళకే బ్రతికే అర్హత ఉంది రిటైరైనాక" అన్నాడు రామారావు.

"మనదేశంలో అట్లాంటి వాళ్ళెంతమంది మావయ్యగారూ! రంగయ్యలాంటి వాళ్ళు బ్రతకడంలేదా! 'కౌంట్ యువర్ బ్లెస్సింగ్స్' అనే సామెత మనం మర్చిపోకూడదు" అంది లలిత.

"అవునమ్మా చెరొక ఆర్నెల్లు అటూ ఇటూ తరిమినా ఇంట్లో ఉంచుకుని ఇంత తిండి పెట్టే కొడుకులుండడం మాత్రం బ్లెస్సింగే కదా" అనేసి అక్కడ్నించి వెళ్ళిపోయాడు రామారావు. ఆయనన్న మాటలకి బాధపడ్డానికి, ఆయనకి జవాబివ్వడానికి లలిత దగ్గర సమయమూ, ఓపికా లేవు. వసుంధర కూడా ఆయనతో మాటలు పొడిగించదు. ప్రశ్నలకి జవాబులే గాని, వ్యాఖ్యలకి జవాబులేం వుంటాయి. డబ్బు పోగొట్టుకున్న బాధ, ఇతరుల మీద ఆధారపడ్డానన్న బాధ - అతన్నిట్లా మాట్లాడిస్తాయనుకుంది లలిత.

* * *

ఒక ఆదివారం మధ్యాహ్నం లలిత ఇంట్లో ఉన్నప్పుడు రామారావు, వసుంధరా గట్టిగా వాదించుకున్నారు. ఆ సాయంత్రం నడవడానికి వెళ్ళిన ఆయన తిరిగిరాలేదు. రాత్రంతా మేలుకుని ఎదురు చూసింది ఆవిడ. ప్రొద్దున పేపర్లో లలిత చదివి వినిపించిన వార్త మరీ మరీ గుర్తొచ్చింది.

విజయవాడలో వృద్ధ దంపతులు ఆత్మహత్య చేసుకుందామని వంతెన మీదకు వెళ్ళారట. ఆవిణ్ణి నదిలోకి తోసేసి, ఆయన దూకబోతుండగా పోలీస్ కానిస్టేబుల్ వస్తూ

ఆయన్ని రక్షించి పోలీస్‌స్టేషన్‌కి తీసుకెళ్ళాడట. హత్యానేరం క్రింద జైల్లో పెట్టారు. కుమిలి కుమిలి ఏడుస్తున్న ఆ వృద్ధుడికి జాలిగుండెల పౌరులు ఎవరో బెయిలు యిప్పించారు.

'పోలీసు తప్పు చేశాడు. ఆయన్ని చావనిస్తే పోయేది. ఇప్పుడు చూడు భార్యని చంపానని పశ్చాత్తాపం, పిల్లల చేత తిట్లు" అంది వసుంధర.

"బెయిలిచ్చాక మళ్ళీ ఎవరూ చూడకుండా వెళ్ళి దూకి చస్తాళ్ళే బాధపడకు" అన్నాడు రామారావు.

అది గుర్తొచ్చి వసుంధర ఉలిక్కిపడింది. ఇటీవల ఎక్కువగా సంభవిస్తున్న వృద్ధుల ఆత్మహత్యల వార్తలన్నీ ఒక్కొక్కటీ గుర్తుకొచ్చి ఆందోళన పడింది.

ఆవిడతోపాటు తనూ రమేష్ పిల్లలు కూడా రాత్రంతా మేలుకొని కూర్చున్నారు. వసుంధర అన్నం తినకుండా గుమ్మంలోనే కూర్చుంది. ఊరి బయట వృద్ధాశ్రమంలో ఉన్న స్నేహితుడి దగ్గర రాత్రి వుండి తెల్లవారి వచ్చాడు రామారావు.

"ఓల్డేజి హోం చాలా బావుంది. కానీ నెలకి మనిషికి రెండు వేలు కట్టాలట. కొంత డిపాజిట్ కూడా. బాగా డబ్బు సంపాదించినవాళ్ళూ, మంచి పెన్షన్లున్నవాళ్ళూ, ఎన్నారైల తల్లిదండ్రులూ, ఇట్లాంటి వాళ్ళకే అన్ని సౌకర్యాలూ" అని నిట్టూర్చాడు.

"అట్లా చెప్పకుండా వెడితే మేం ఎంత కంగారుపడ్డాం. అమ్మ అయితే అన్నం కూడా తిన్లేదు" అన్నాడు రమేష్.

"ఏం చచ్చిపోయాననుకున్నారా?" అన్నాడు రామారావు.

* * *

"మీకోసం భోజనం టేబుల్ మీద పెట్టాను. నేను స్కూల్‌కి వెడుతున్నాను" అంది లలిత.

"సాయంత్రం ముత్యం యింటికి వెళ్ళి ఖచ్చితంగా అడిగిరా. రేపు పోలీస్ రిపోర్ట్ యిద్దాం" అన్నాడు.

"తప్పకుండా వెడతాను" అంది లలిత.

అత్తగారి పాడ గిట్టని కల్పన కూడా రెండురోజుల కొకసారి స్కూల్‌కి ఫోన్ చేసి చాలా శ్రద్ధగా అడుగుతోంది. "అత్తయ్యగారి గురించి ఏమైనా తెలిసిందా?" అని.

పాపం రామారావు. ఆవిడుండగా, ఆవిడని ఒక ఆట ఆడించేవాడేగానీ, మనిషి డీలా పడిపోయాడు. సేవకురాలే గాదు. తోడూనీడా కూడా కదా. ఎప్పుడూ తన నీడగానే భావించాడుగానీ 'తోడు'గా గుర్తించలేదు. ఇప్పుడు ఆ విషయం స్ఫురిస్తున్నట్లుంది.

* * *

"నాకు టీ తాగాలనిపించింది. నీక్కూడా కలిపాను. ఎలా వుందో చూడు. బావుంటే తాగు. లేకపోతే మళ్ళీ కలుపుకో"

స్కూల్ నించి రాగానే టీకప్పు అందించాడు రామారావు. నిజానికి ఆ టీ బాగాలేదు గానీ ఎందుకో ఆయన్ని చూసి జాలేసి మందులాగా మింగేసింది. వసుంధర వెళ్ళిన దగ్గర్నుంచీ తను సాయంత్రం టీ తాగడం మానేసింది. తాగబుద్ధి కావడంలేదు.

"ట్యూషన్ పిల్లల దగ్గర కాసేపు నేను కూర్చుంటాను. వెళ్ళొస్తావా ముత్యం యింటికి" అన్నాడు.

లలిత బయలుదేరబోతుంటే "అన్నట్లు మర్చిపోయానమ్మా. నీకెక్కడ్నించో ఉత్తరం వచ్చింది. అమెరికా నుంచనుకుంటా" అని ఒక కవరు యిచ్చాడు. అమెరికా నుంచే. తన ఎడ్రస్‌కే. 'అమెరికాలో నాకెవరూ లేరే' అనుకుంటూ కవరు విప్పింది.

ప్రియమైన లలితకి,

మీకెవరికీ ఒక్కమాట కూడా చెప్పకుండా, మిమ్మల్ని ఇంత ఆందోళన పెట్టి వెళ్ళినందుకు ఏమీ అనుకోకండి. నేనెందుకు వెళ్ళానో, ఎక్కడికి వెళ్ళానో చెబితే నువ్వు అర్థం చేసుకుంటావని నీకు వ్రాస్తున్నాను.

ఆరోజు మధ్యాహ్నం నాతో పోట్లాడి రాత్రంతా ఎక్కడో ఉండొచ్చారాయన గుర్తుందా. ఆ మధ్యాహ్నం ఆయన ఏమన్నారో తెలుసా? ఆయన సమస్త బాధలకీ, కష్టాలకీ, తల మీద ఆచ్ఛాదన లేకపోవడానికి, చేతిలో డబ్బు లేకపోవడానికి కారణం నేనేనట. నేను ఒక్క రూపాయి సంపాదించకపోగా ఆయన సంపాదనంతా ఖర్చు చేసేశానట. అసలు నేను ఎస్సెల్సీ అవగానే చదువుకుంటాని ఎంత గోల పెట్టినా మా నాన్న చదివించలేదు. టీచర్ ట్రైనింగ్, నర్స్ ట్రైనింగ్, ఆఖరికి టైపు, షార్ట్‌హాండ్ ఏదైనా చేస్తానని బ్రతిమిలాడినా వినక పెళ్ళి చేశాడు. పెళ్ళయిన్నాటి నుండి సంసార సాగరంలో పడి ఈదాను. అంతంతమాత్రం సంపాదనలో కూడా ఆయన స్వంత ఖర్చులు బాగానే పెట్టుకునేవారు. పైసా దాచుకోవాలని ఉండేది కాదు. నాకు వీలైనంత కష్టం నేనూ పడ్డాను. ఎంత చాకిరీ చేశాను. పిల్లల చదువులు, ఆడపిల్ల పెళ్ళి ఇవ్వన్నీ ఆయనొక్కడివల్లే అయ్యాయట. నావల్ల ఏం కాలేదట. సరే, ఆయన డబ్బు పోయిన కష్టంలో అట్లా మాట్లాడారని సరిపెట్టుకున్నాను. మర్నాడు సుజాత ఇంటికి వెళ్ళినప్పుడు ఈ సంగతులన్నీ చెప్పాను. తను సానుభూతితో విని పిల్లలు చదువుకోడానికి వాళ్ళింట్లో ఉన్న మూడు బెడ్ రూమ్స్‌లో ఒకటి ఊర్కెనే యిచ్చింది. నువ్వూ, ఆయనా కూడా సంతోషించారు. తరువాత నాకేం తోచక మధ్యాహ్నం పూట రోజూ వాళ్ళింటికి కాసేపు వెళ్ళి తనకి చిన్నచిన్న పన్లు చేసి పెట్టేదాన్ని. తనకి మోకాళ్ళ నెప్పులు, బి.పి, షుగరు లాంటివన్నీ వున్నాయి. వంటమనిషి, పనమ్మాయి వున్నా నేను చేసిపెట్టిన చిన్నచిన్న పన్లకే చాలా సంతోషపడేది. ఈరోజుల్లో

ఉద్యోగాలు చేసే ఆడవాళ్ళు చాలామందికి నాలాంటి మనిషి దొరికితే పొంగిపోతారంది. తన మోకాళ్ళ నెప్పుల మూలంగా, తన కూతురు ప్రసవించినప్పుడు అమెరికా వెళ్ళలేక పోయిందట. అప్పుడు అక్కడ వున్న ఒక గుజరాతీ ఆవిణ్ణి ఏడాది వుంచుకుని నెలకి ఎనిమిది వందల డాలర్లు యిచ్చిందట. అలా ఆవిడ పదివేల డాలర్లు పుచ్చుకుని వెళ్ళిందట.

"అట్లా నాకెవరన్నా యిస్తే నేనూ వెడుదును. నా జన్మలో నాదంటూ ఒక రూపాయి సంపాయించి ఎరుగను. నలభై ఏళ్ళ కష్టానికి రూపాయి విలువ లేదు" అన్నాను.

"నిజంగా నువ్వు వెడతావా?" అంది సుజాత.

వెడతానన్నాను.

అప్పుడు చెప్పింది. తన కూతురికి ఇప్పుడు కూడా మనిషి అవసరమేనట. తన కూతురు బావగారు అమెరికాలో వున్న ఇండియన్ ఎంబెసీకి ట్రాన్స్‌ఫర్ అయ్యారట. ఆయన తలచు కుంటే పాస్‌పోర్ట్, వీసాలు ఇప్పించగలడు. ఆయన పదిరోజుల్లో హైదరాబాద్ వస్తాడు. వచ్చినప్పుడు మనం వెళ్ళి కలుద్దాం అంది. అట్లా నన్ను తనకి తోడుగా రమ్మన్నట్లు మీ మావగార్ని ఒప్పించి తీసుకువెళ్ళింది. పదిరోజులు హైదరాబాద్‌లో ఉండివచ్చాను. ఆ తరువాత నాకొచ్చే కాగితాలన్నీ సుజాత కేరాఫ్‌కే వచ్చేవి. నాకు పాస్‌పోర్ట్ వచ్చింది. మళ్ళీ వీసాకోసం రెండురోజులు మద్రాసు వెళ్ళాల్సొచ్చింది. దానికి కూడా అబద్ధాలు చెప్పి ఆమెతో వెళ్ళాను. చివరికిప్పుడు టికెట్టు కూడా వచ్చింది. నాకు రానూపోనూ టికెట్లు కొనిచ్చి నెలకి ఆరువందల డాలర్లు యిచ్చేలా మాట్లాడింది. ఆరునెలలకి ఆమె చదువు అయిపోతుంది. ఆమె చదువు కుంటుంటే పాపని చూసి, వంట చేసి పెట్టాలి. నేను కూడా వచ్చేటప్పుడు కొన్నివేల డాలర్లతో వస్తానంటే నేనెంత ఆనందించానో నీకు తెలీదు. డబ్బు సంపాదించడంలో ఎంత శక్తి ఉందో నాకర్థం అయింది.

సుజాత నన్ను మద్రాసు తీసుకువచ్చి విమానం ఎక్కించింది. అక్కడ నాకవసరం అయ్యే చీరలవీ కొనిచ్చింది. ఒక పల్లెటూళ్ళో పుట్టి పెరిగి, ఒక చిన్న పట్నంలో కాపురం ఉండి, ఇండియాలోనే ఏ ప్రదేశమూ ఎరగని నేను లాస్ ఏంజిలిస్‌లో విమానం దిగాను. మన రాష్ట్రంలో చాలామంది గల్ఫ్ దేశాలకి పనివాళ్ళుగా వెళ్ళి డబ్బు సంపాదించుకొస్తారని నాకు తెలుసు. అసలు 'కువైట్ సావిత్రమ్మ' అనే కథ నువ్వే నాకు చెప్పావు. ఇది అంత కష్టమైన ఉద్యోగం కూడా కాదు. పనిపనిషి కన్నా కాస్త మెరుగ్గా చూసే కల్పన దగ్గర వుండ గలిగినప్పుడు, డబ్బిచ్చిన వాళ్ళ దగ్గర అణుకువగా ఉండడంలో తప్పేం లేదు గదా! నేనెక్కడైనా ఉండగలను అనుకున్నాను. తిరిగి వచ్చాక కూడా ఏదో ఒక పని చేస్తాను. నా చేత ఏదో ఒకటి చేయిస్తానని సుజాత చెప్పింది. నేనొచ్చేవరకూ నా జీతంలో మినహాయించుకుని నెలకొక రెండువేలు మీ మావగారికివ్వమని సుజాతకి చెప్పాను. ఆయన తీసుకోరు. నువ్వు తీసుకో.

నా మాట నువ్వు తప్పకుండా వింటావనే ఆశతో రాస్తున్నాను. నువ్వు తప్పకుండా ఆ డబ్బు తీసుకుని ఆయనకేం కావాలో చూడు. నేనొచ్చేవరకూ ఆయన్ని కల్పన దగ్గరకు పంపకు. పిల్లలకి మంచి మార్కులు, ర్యాంకులు రావాలని అమ్మవారికి పూజచేస్తాను. రమేష్‌కి నచ్చజెప్పు. ప్రతి ఆదివారం ఉదయం సుజాతకి వాళ్ళమ్మాయి ఫోన్ చేస్తుంది. నాతో మాట్లాడాలనుకుంటే సుజాత పిలుస్తుంది. నాకు తప్పకుండా ఉత్తరం రాస్తావని నమ్ముతూ

ప్రేమతో
వసుంధర

ఆదివారం ఆంధ్రజ్యోతి, 15 డిసెంబర్ 2002